క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటు



ఆలయ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద రెండు సీసీ కెమెరాలు మంగళవారం ఏర్పాటు చేశారు. ఉత్సవాలు, పూజల సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ఎటువంటి ఘర్షణలు, దొంగతనాలు జరిగినా నిందితులను పట్టుకునేందుకు సులువుగా ఈ కెమెరాలు దోహదపడతాయని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు.

బత్తిలిలో పశువైద్య శిబిరం



బత్తిలిలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

భామిని: మండలంలోని బత్తిలిలో పశువైద్యాధికారి డాక్టర్ కె.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ టింగ అన్నాజీరావు శిబిరాన్ని ముందుగా ప్రారంభించారు. అనంతరం పశువుల మందను రప్పించి వైద్య సేవలు అందించారు. నేరడి బి, వడ్డంగి వెటర్నరీ సహాయకులు రమేష్, హరిప్రియ, గోపాలమిత్రలు తమ వంతు సేవలు అందించారు.

తహసీల్దార్‌కు ప్రోటోకాల్ పట్టదా?

బలిజిపేట: మండల తహసీల్దార్‌కు ప్రోటోకాల్ పట్టదా? రెవెన్యూ సదస్సుల సమయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులతో రెవెన్యూ సదస్సులు నిర్వహించుకోవడం ఏమిటి? సమావేశానికి ఎందుకు హాజరుకాలేదని జెడ్పీటీసీ రవికుమార్, పెద్దింపేట ఎంపీటీసీ సాంబమూర్తి, సర్పంచ్ జయప్రకాష్‌లు ప్రశ్నించారు. ఎంపీపీ నాగమణి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారివారి సమాచారాలను వివరించారు. రెవెన్యూ శాఖ పరంగా ఆర్‌ఐ కరుణాకర్ మాట్లాడేందుకు సిద్ధమవగా తహసీల్దార్ ఎందుకు రాలేదని ఎంపీటీసీ సభ్యుడు ఎం.సాంబమూర్తి ప్రశ్నించారు. కలెక్టర్ కార్యాలయానికి పనిమీద వెళ్లారని ఆర్‌ఐ బదులు చెప్పడంతో మండల సర్వసభ్య సమావేశం రోజునే పనులు ఉంటాయా అని సభ్యులు ప్రశ్నించారు. గత సమావేశానికి హాజరుకాలేదని, ఇప్పుడు హాజరుకాలేదని ఇలా అయితే రెవెన్యూ సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయని నిలదీశారు. అంతేకాక రెవెన్యూ సదస్సుల సమయంలో తహసీల్దార్ ప్రోటోకాల్‌ను కాలరాశి అధికార పార్టీ నాయకులకు మాత్రమే సమాచారం ఇచ్చి వారితోనే సదస్సులు నిర్వహించారని, ఇదేమి చోద్యమని ప్రశ్నించారు. వాటిని ప్రశ్నిస్తామని తెలిసి సమావేశానికి డుమ్మా కొట్టారని, దీనిపై ఉన్నతాధికారులకు తెలియపరచాలని ఎంపీడీఓ విజయలక్ష్మిని కోరారు.

దివ్యాంగ పింఛన్లు తొలగించారా?
వ్యవసాయశాఖ ఏఓ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతుండగా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రబీ పంటలకు నష్టం వాటిల్లిందని పంటనష్టం వస్తుందా? రాదా? అని సభ్యులు ప్రశ్నించగా 30శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితే పరిహారం వస్తుందని ఏఓ తెలిపారు. వెండర్ కోడ్‌పై పనులు చేపట్టవద్దని పీఆర్ ఏఈ అంబేద్కర్‌కు సూచించారు. వికలాంగ పింఛన్లపై సర్వే నిర్వహించారు కదా వాటిలో ఏమైనా తొలగించారా? లేదా? అని సభ్యుల ప్రశ్నించగా అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. దీనిపై సభ్యులు అసంతృప్తి చెందారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

రెండోసారి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: రెండోసారి పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ ఎన్నికల ప్రధాన కార్యదర్శి పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపడుతున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ తనపై నమ్మకంతో పార్టీ పెద్దలు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ప్రతి కార్యకర్తకు మంచి జరిగే విధంగా అందరినీ కలుపుకుని పార్టీని ముందుకు నడిపిస్తానన్నారు.
ఈ విషయం తెలుసుకున్న జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కురుపాంలో డయేరియా కలకలం



కురుపాం మండల కేంద్రంలో డయేరియా కలకలం రేపుతోంది. గత కొన్నిరోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ స్థానికంగా ఉన్న సీహెచ్‌సీ, ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించి, చికిత్స పొందుతున్నారు. ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 25 మంది డయేరియా బాధితులు ఆస్పత్రుల్లో చేరి వైద్యసేవలు పొందుతున్నట్లు వైద్యాధికారిణి శోభారాణి మంగళవారం తెలిపారు. ఎక్కడపడితే అక్కడ నెలకొన్న పారిశుధ్య లోపం, మురుగునీటి నిల్వలు, తాగునీటి పైపులైన్ల లీకేజీల కారణంగానే డయేరియా ప్రబలుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.
-గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

ఇదో మాయ...



ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లించామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. వాస్తవానికి రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్టు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణ.. వీరఘట్టం మండలం చిదిమి, రేగులపాడు గ్రామాల్లో పలువురు వ్యాపారులు రైతుల నుంచి మంగళవారం ధాన్యం కొనుగోలు చేసి, రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్‌లు తీసి మిల్లులకు తరలించారు. ఈ చిత్రం రేగులపాడు గ్రామంలో మిల్లుకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న ధాన్యం బస్తాలు.
- వీరఘట్టం

‘ఉపాధి’ పనుల పరిశీలన



జియ్యమ్మవలస మండలం, గౌరీపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీఓ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా నిర్దేశిత కొలతల ప్రకారం వేతనదారులతో పనులు చేయించాలని, అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలని, జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని తెలిపారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, మస్తర్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- జియ్యమ్మవలస

చౌరవ చూపితే.. మహర్దశ..!

- వీరఘట్టం నగర పంచాయతీగా మారేందుకు అవకాశం
- 1918లో 4వేల జనాభాతో పంచాయతీ
- 1971లో 12 వేల జనాభాతో మేజరు పంచాయతీ
- ప్రస్తుత జనాభా 20వేలకు పైనే..



వీరఘట్టం మేజరు పంచాయతీ

వీరఘట్టం:

మూడేళ్ల కిందట రాష్ట్రంలో జరిగిన జిల్లాల పునర్విభజనలో కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో చేరిన వీరఘట్టం నేడు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అటు డివిజన్ కేంద్రం పాలకొండకు, ఇటు జిల్లా కేంద్రం పార్వతీపురానికి మధ్యలో వీరఘట్టం మేజరు పంచాయతీ ఉండడం ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతమున్న జనాభా ప్రాతిపదికన తీసుకుంటే భవిష్యత్‌లో నగర పంచాయతీగా మారేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. వీరఘట్టం-వంగర మండలాలను అనుసంధానం చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కిమ్మి-రుషింగి వంతెన అందుబాటులోకి రావడంతో వంగర మండలంలోని 25 గ్రామాల ప్రజలు నిత్యం వీరఘట్టంకు వస్తుండడంతో ఇక్కడ వ్యాపారాభివృద్ధి గణనీయంగా పెరుగుతోంది. జియ్యమ్మవలస, వంగర, గరుగుబిల్లి, సీతంపేట, పాలకొండ మండలాల్లోని కొన్ని గ్రామాలకు వీరఘట్టం పట్టణం అన్ని విధాలుగా అందుబాటులో ఉండడంతో వీరఘట్టంలో అన్ని వ్యాపారాలు జోరందుకున్నాయి. నగర పంచాయతీగా అభివృద్ధి చేస్తే ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ప్రభుత్వంలో పెద్దలు చొరవ చూపితే వీరఘట్టానికి మహర్దశ పడుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..
ప్రపంచ మల్లమార్తాండ, కళియుగ భీముడు కోడి రామ్మూర్తినాయుడు జన్మించిన గడ్డ వీరఘట్టం. బ్రిటిష్ కాలంలో 4 వేల జనాభాతో 1918లో వీరఘట్టం గ్రామం పంచాయతీగా ఆవిర్భవించింది. అనంతరం జనాభా పెరగడంతో 1971లో మేజరు పంచాయతీగా ఏర్పడింది. మేజరు పంచాయతీగా మారినపుడు వీరఘట్టం పట్టణంగా మారింది. అప్పటిలో జనాభా సుమారు 12 వేల పైబడి ఉండేవారు. కాలక్రమేణా జనాభా అంచలంచెలుగా పెరుగుతుండడంతో ప్రస్తుతం వీరఘట్టం పట్టణ జనాభా దాదాపు 20 వేలకు పైబడి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

నగర పంచాయతీగా మారాలంటే..
వీరఘట్టం మేజరు పంచాయతీ ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే నగర పంచాయతీగా మారాల్సి ఉంది. అందుకు 25 వేల నుంచి 30 వేల జనాభా ఉంటే నిబంధనల ప్రకారం నగర పంచాయతీగా మారే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అందుకు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలు వీరఘట్టం మేజరు పంచాయతీలో విలీనం అయితే వీరఘట్టం పట్టణం నగరపంచాయతీగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వీరఘట్టంకు సమీపంలో నడుకూరు, బూరుగ, విక్రమపురం, యు.వెంకమ్మపేట గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 8 వేలకు పైబడి జనాభా ఉన్నారు. ఈ గ్రామాలు వీరఘట్టంలో విలీనం అయితే భవిష్యత్‌లో వీరఘట్టంకు మహర్దశ పట్టనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అవకాశాలున్నాయి..



వీరఘట్టం మేజరు పంచాయతీలో ప్రస్తుత జనాభా 20 వేల వరకు ఉంది. భవిష్యత్‌లో నగర పంచాయతీగా మారే అవకాశాలు ఉన్నాయి. వీరఘట్టంకు సమీపంలో ఉన్న గ్రామాలు మేజరు పంచాయతీలో విలీనం అయితే నగర పంచాయతీగా రూపాంతరం చెందే అవకాశాలు ఉన్నాయి.
– ఎం.రవి, ఈఓ, వీరఘట్టం మేజరుపంచాయతీ

అభివృద్ధికి తీర్మానిస్తాం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీరఘట్టం పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాం. గత ప్రభుత్వాలు ఓట్ల రాజకీయాలు చేసి వీరఘట్టం పట్టణం అభివృద్ధి చెందకుండా అడ్డుకున్నారు. మాకు ఓట్లు ముఖ్యం కాదు గ్రామాభివృద్ధే లక్ష్యంగా చేసుకున్నాం. అందుకే రూ.5.50 కోట్ల నిధులతో రోడ్లు విస్తరణ పనులు చేపట్టాం. వీరఘట్టం అభివృద్ధి చెందుతుండడంతో నగర పంచాయతీ అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నందున ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు తీర్మానం చేస్తాం.
– దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీపీ

పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి : జేడీ



జీవాలకు చికిత్సలు నిర్వహిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

పాలకొండ: పాడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా తమ పశు సంపదను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివ్వాల మన్మధరావు అన్నారు. మండలంలోని తంపటాపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులకు పలు సూచనలు చేశారు. శీతాకాలంలో పాడి సంపదకు వచ్చే వ్యాధులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జీవాల పెంపకందారులకు మందులు అందించారు. శిబిరంలో ఏడీ మాణిక్యాలరావు, మండల పశువైద్యధికారి సిద్దార్థ పాల్గొని సేవలు అందించారు. 96 పశువులకు, 250 జీవాలకు వ్యాక్సినేషన్ చేశారు.

దరఖాస్తు చేసుకోండి



జేకే పాడులో జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ నిర్మలాజ్యోతి

గుమ్మలక్ష్మీపురం: వ్యవసాయ పరికరాలు కావాల్సిన రైతులంతా దరఖాస్తు చేసుకోవాలని కురుపాం ఏడీఏ ఎ.నిర్మలాజ్యోతి తెలిపారు. మండలంలోని లుంబేసు గ్రామంలో ఏవో సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరిస్తూనే ఖరీఫ్, రబీ సాగు పంటలకు వ్యాపించే తెగుళ్లు వాటి నివారణ చర్యలను ఏడీఏ వివరించారు. అనంతరం జేకే పాడు గ్రామంలోని నిరుపయోగంగా ఉన్న జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించి, నిర్వహణ చర్యలపై ఆరాతీశారు. నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ: ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాధ్ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎం కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ దేవి, వైద్య సిబ్బంది తమ వంతు సేవలందించారు.

కొత్తగూడలో అగ్నిప్రమాదం



ఇంట్లో కాలిపోయిన సామగ్రి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గ్రామంలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఆరిక మాధవరావు రేకుఇల్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు అందులోని ధాన్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, ఇంటి సామగ్రి దగ్ధమయ్యాయి.
ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వమే ఆదుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

సేవలతోనే గుర్తింపు



జయమణిని ఘనంగా సన్మానిస్తున్న డిప్యూటీ ఈఓ, ఎంఈఓ తదితరులు

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో చేపట్టిన సేవలు సమాజంలో ప్రత్యేక గుర్తింపును అందిస్తాయని డిప్యూటీ ఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిరాలిగా అవార్డు పొందిన పట్టణానికి చెందిన జంప జయమణిని మంగళవారం స్థానిక ఎంఆర్‌సీలో ఘనంగా సన్మానించారు. సహ ఉపాధ్యాయులు ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ బోధన, సేవలు ద్వారా అవార్డులు రాష్ట్ర స్థాయిలో పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.సోంబాబు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరాంకుశంనాయుడు, జామి రవి, పద్మావతి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.వాసుదేవరావు, హేమనికుమార్, రవి, భాను, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సెస్ బకాయిలు చెల్లించాలి



ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం అందిస్తున్న లైబ్రేరియన్ మధుసూదనరావు

గరుగుబిల్లి: పెండింగ్‌లోని గ్రంథాలయ సెస్ బకాయిలను వెంటనే చెల్లించాలని లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావును మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇంటిపన్ను వసూళ్లలో 8 శాతాన్ని గ్రంథాలయానికి సెస్ కింద చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశించడం జరిగిందని, ఈ మేరకు గ్రంథాలయానికి సెస్ చెల్లించేలా చూడాలన్నారు. స్పందించిన ఈవోపీఆర్‌డీ.. కార్యదర్శులకు చెబుతామన్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

పార్వతీపురంటౌన్: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులైన కుటుంబాల వారికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా పౌర సరఫరాల అధికారి పి.ధర్మ చంద్రారెడ్డి మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న సిలిండర్లకు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారన్నారు. లబ్ధిదారులు దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సదరు గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారులతో సమావేశం నిర్వహించి, లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువైతే సదరు గ్యాస్ ఏజెన్సీలపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద ఏ ఒక్కరూ ఎటువంటి అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ విధంగా కాకుండా లబ్ధిదారుల నుంచి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే 1967 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని, ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం నందు జరుగు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్‌ఎస్) కూడా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

పెదబుడ్డిడిలో ‘పొలం పిలుస్తోంది’



రైతులకు సూచనలిస్తున్న ఏవో జ్యోత్స్న

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో ఏవో జ్యోత్స్న ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమై పలు పంటలకు వ్యాపించే తెగుళ్లు.. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం రైతులతో కలిసి అరటి, మొక్కజొన్న పంటలను పరిశీలించి, వాటి సాగులో వారికి తలెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస:

గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా అందిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్ కోరారు. మండలంలోని గెడ్డతిరువాడ గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను ఆయన మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆరేళ్ల వయసులోపు శిశువులకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయాలని, ఇంకా ఎవరి ఆధార్‌కార్డులో అయినా తప్పులు ఉన్నా మార్పులు చేయాలన్నా ఆధార్ కేంద్రాలను ఆశ్రయించి, చేయించుకోవాలన్నారు. ఆధార్ చేసుకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

పీఎం సూర్యఘర్‌తో బహుళ ప్రయోజనాలు

సీతానగరం: కేంద్రప్రభుత్వం అమలు చేసిన సూర్యఘర్ సోలార్ సిస్టం వల్ల విద్యుత్ వినియోగ దారులకు బహుళ ప్రయోజనాలున్నాయని, ప్రతి ఒక్కరూ సోలార్ సిస్టం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీట్రాన్స్‌కో డీఈఈ సీహెచ్ వి.రమణరావు అన్నారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సోలార్ సిస్టం అమలుకు అవసరమైన స్థల సేకరణకు తహసీల్దార్ ప్రసన్నకుమార్‌తో చర్చించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ వినియోగ దారులకు రాయితీపై సోలార్ పథకాన్ని మంజూరుచేయనున్నట్లు తెలిపారు.
1 కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి రూ.70 వేలు అవుతుందని ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుందని చెప్పారు. 1 కిలోవాట్ విద్యుత్ ఉత్పతి చేస్తే ఒకకుటుంబానికి మూడుఫ్యాన్‌లు, ఇంటికి అవసరమైన విద్యుత్ తయారవుతుందన్నారు.

గాలికుంటు వ్యాధితో పాల దిగుబడిపై ప్రభావం



భామిని: పశువులు, జీవాలకు సోకే గాలికుంటు వ్యాధి పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వాతావరణ మార్పులతో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. తీవ్రత ఎక్కువైతే అవి మరణించే ప్రమాదముంది. ముందుగానే టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవచ్చని పశు వైద్యులు సూచిస్తున్నారు. ఇది ఎక్కువగా సంకరజాతి పశువుల్లోనే వస్తుందని చెబుతున్నారు. ఏడాదికి రెండుసార్లు గాలి కుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేయడం ద్వారా దీన్ని నివారించవచ్చని పేర్కొంటున్నారు.

వ్యాధి సోకే విధానం..
వ్యాధి సూక్ష్మాతి సూక్ష్మజీవుల వల్ల వస్తుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాల ఉత్పత్తి తగ్గుతోంది. వాటి పాల ద్వారా దూడలకు వ్యాపిస్తుంది. నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. చర్మం గరుకుగా మారుతుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలు తాగిన దూడలు మరణించే అవకాశం ఉంది. జ్వర తీవ్రత 104 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. దీంతో పశువులు నీరసిస్తాయి. గిట్టల్లో పుండ్లు ఏర్పడటం వల్ల పశువులు మేతకు కూడా కదల్లేని పరిస్థితి నెలకొంటుంది. నోటి సంచల కారణంగా ఇంటి వద్ద కుడితి కూడా తాగేందుకు పశువులు ఇబ్బందులు పడతాయి.

వ్యాధి అనంతర లక్షణాలు
వ్యాధి నుంచి కోలుకున్న పశువులు ఎక్కువ కాలం వాతారణంలో వేడిని తట్టుకోలేవు. అధిక వేగంతో శ్వాస తీసుకుంటాయి. పశువుల శరీరంపై వెంట్రుకల ఎక్కువగా పెరుగుతాయి. వ్యాధి నివారణకు పశువుల ఆస్పత్రిలో వ్యాక్సిన్లు వేయించుకోవాలి.

నివారణ చర్యలు



ఏడాదిలో రెండు విడతలుగా గాలికుంటు వ్యాక్సిన్లు వేస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాలు పేరున వ్యాక్సిన్లు వేస్తున్నాం. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో లక్షణాలను వివరిస్తున్నాం. నివారణ చర్యలు కూడాచెబుతున్నాం. వ్యాధి తెలిసిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన మందులు వాడాలి. వ్యాక్సిన్లు వేయించుకోవాలని అప్రమత్తం చేస్తున్నాం.
– డాక్టర్ సంతోష్‌కుమార్
వైద్యాధికారి, చిన్నబగ్గ